

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

అంగన్‌వాడీలపై పోలీసు నిర్బంధం

- విజయవాడ ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డుకున్న పోలీసులు
- సిఐటియు నేతలు గోపాలన్, ప్రతాప్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణికి నోటీసులు
- జిల్లాలో 300 మంది అంగన్‌వాడీ టీచర్లకూ నోటీసులు



గోపాలన్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీసు అధికారి



కళ్యాణికి నోటీసులు అందజేస్తున్న పోలీసు

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుంది. ఈ హక్కును నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి. సమస్యపై గొంతెత్తితే ఆ గొంతును నొక్కడం, పోలీసులను ప్రయోగించి నిర్బంధించడం, అరెస్టులకు పాల్పడడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి కటకటాల వెనక్కి నెట్టుతున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగలోకి తొక్కి రాజ్యాంగాన్ని పరిహాసం చేయడంతోపాటు హక్కులను హరించి వేస్తున్నారని వామపక్షాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

అంగన్‌వాడీలు అనేక ఏళ్ల నుంచి దీర్ఘకాలిక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్యలపై అనేక ఆందోళనలు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారం లభించలేదు. దీనికితోడు అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు సైతం ఏ ఒక్కటీ అమలు కాలేదు. ఈ సమస్యలపై జిల్లాలో అనేకసార్లు అంగన్‌వాడీలు దశలవారీ పోరాటాలు కూడా చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 25న తేదీన మహాధర్నా చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని విధించింది. యూనియన్ నాయకులు, అంగన్‌వాడీల ఆచూకీ కోసం జల్లెడ పట్టారు. జిల్లా అంతటా వీరి కదలికలపై నిఘా పెట్టారు. ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారని ఆరా తీశారు. విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించింది. సిఐటియు నేతలు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, చివరకు అంగన్‌వాడీ టీచర్లకు సైతం పోలీసులు నోటీసులు జారీ చేశారు. కొంతమందిని గృహ నిర్బంధం చేశారు. భీమవరంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, తణుకులో సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఆకివీడులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణికి ఇంటి వద్ద పోలీసులు నోటీసులు జారీ చేశారు. అలాగే పాలకొల్లు అర్బన్, తాడేపల్లిగూడెం పట్టణం, అర్బన్, ఆకివీడు పట్టణాలతోపాటు జిల్లాలో 300 మంది అంగన్‌వాడీ టీచర్లకు నోటీసులు జారీ చేశారు. విజయవాడ ధర్నాకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఆందోళనకు పిలుపు ఇచ్చిన ప్రతిసారీ అక్రమ నిర్బంధాలకు పాల్పడడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటిమీద రాతగా మిగిలిపోయింది. రకరకాల యాప్‌లు తెచ్చి అంగన్‌వాడీలకు పనిభారం పెంచారు. కొత్తగా గర్భిణులు, బాలింతలకు ఫేస్ యాప్ తీసుకొచ్చారు. ఫోన్లు పనిచేయకపోయినా, నెట్ సిగ్నల్ లేకపోయినా అమలు చేయాలని అధికారులు అంగన్‌వాడీలను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చి సెంటర్లను మెర్జ్ చేస్తున్నారు. లబ్ధిదారులను కుదించడానికి పోషణ ట్రాక్‌యాప్‌ను తీసుకొచ్చింది. ప్రయివేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారు. ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. అయితే వేతనాలు పెరగలేదు. అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు కావడం లేదు. సెంటర్ల అద్దెలు, టిఎ బిల్లు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ బిల్స్ నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను అవమానించే విధంగా కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్ఒ, ఎండిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. అనేక సమస్యల మధ్య వారు సతమతమవుతున్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన అంగన్‌వాడీలు ఆ విధంగా అడుగులు వేస్తుంటే ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని విధిస్తోంది.

తణుకు రూరల్: పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం అర్ధరాత్రి సిఐటియు నాయకులకు, అంగన్‌వాడీలకు నోటీసులిచ్చి 25న చలో విజయవాడను అడ్డుకోవడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోంది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయమంటే నియంతృత్వంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న వారిని నిర్బంధం, అరెస్టులు, నోటీసులు వంటి వాటితో అడ్డుకోవడం నియంతృత్వ చర్యలేనని విమర్శించారు. విజయవాడ వెళ్లేవారిని ఆపడం మానుకొని వారి సమస్యలు పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలు మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.



తణుకు : ప్రతాప్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

అంగన్‌వాడీల నిర్బంధం అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో చేపట్టనున్న ధర్నాను విఫలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను ప్రయోగించడం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని విధించడం ప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ధర్నాకు ప్రయత్నిస్తుంటే హింస జరుగుతుందని పోలీసులే తప్పుడు ప్రచారం చేయడం దారుణమని తెలిపారు. జిల్లాలో ఎక్కడికక్కడ ఇళ్ల వద్దే అంగన్‌వాడీ నాయకులను, కార్యకర్తలను, ట్రేడ్ యూనియన్ల నాయకులను గృహ నిర్బంధం చేయడం, నోటీసులు జారీ చేయడం, వారి వాహనాలను అడ్డుకోవడం, బెదిరించడం దుర్మార్గమని విమర్శించారు. ధర్నాకు అనుమతివ్వకపోవడం నిరంకుశమని, అప్రజాస్వామికమని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారని, కలెక్టరేట్ల వద్ద వేలాది మందితో ధర్నాలు, ప్రదర్శనలు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏమాత్రమూ స్పందించక పోవడం అన్యాయమని విమర్శించారు. జిల్లాలో గృహ నిర్బంధాలు, నోటీసులు, అడ్డుకోవడాలు, అరెస్టులు ఆపాలని కోరారు. జిల్లాల్లో అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని, విజయవాడ ధర్నాకు అనుమతివ్వాలని కోరారు. ఆయా సంఘాల నాయకులతో చర్చలు జరిపి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞత ప్రదర్శించాలని డిమాండ్ చేశారు.



పెనుమంట్ర : మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

కొనసాగిన దళిత రక్షణ యాత్ర

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు డిమాండ్ చేశారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం గణపవరం, అత్తిలి మండలాల మీదుగా పెనుమంట్ర మండలంలోకి ప్రవేశించింది. తొలుత నత్తారామేశ్వరం ప్రారంభంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో యాత్రకు స్వాగతం పలికారు. పొలమూరులో ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జరిగిన సభలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రయివేటుపరం చేసే అన్ని సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు దళితులకు రక్షణగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ చట్టాన్ని మార్పులు చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని శరవేగంగా అమలు చేస్తోందని చెప్పారు. మరోవైపు దళితపేట అభివృద్ధికి పోరాడి సాధించుకున్న సబ్ ప్లాన్ చట్టాన్ని నీరుగారుస్తున్నారన్నారు. అనంతరం యాత్రకు సంఘీభావంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా చిన్న వీరభద్రం, మహిళా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్యప్రసాద్, షేక్‌వలీ, కళాకారులు రాఘవులు, శ్రీనివాస్, యువజన నాయకులు కేతా ప్రమోద్ పాల్గొన్నారు.



గణపవరంలో..

గణపవరం : మోడీ హయాంలో రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లు నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర నాలుగో రోజు ఆదివారం మండలంలోని గణపవరం, సరిపల్లి, పిప్పర దళితపేటల్లో సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గణపవరంలో దళిత రక్షణ యాత్రకు అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా స్వాగతం పలికింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, బల్ల చిన వీరభద్రం, ప్రజా నాట్యమండలి నాయకులు చైతన్య ప్రసాదు షేక్ వల్లి రంగ పాల్గొన్నారు.

వీరవాసరం : మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న దేశంలో మత ఘర్షణలను సృష్టిస్తున్న బిజెపిని గద్దె దించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం గణపవరం, అత్తిలి, పెనుమంట్ర మండలాల మీదుగా వీరవాసరం మండలంలోకి ప్రవేశించింది. పెదపేటలో అంబేద్కర్ విగ్రహానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనలే అందుకు నిదర్శనమన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఉదాంతాలు చూసి యావత్ భారతదేశం సిగ్గుపడాల్సి వచ్చిందన్నారు. రెండు సార్లు బిజెపి అధికారంలోకి వచ్చాక దేశం అతలాకుతలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు, వ్యకాస జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా చిన వీరభద్రం, మహిళా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత సత్యనారాయణ

కొరటాల శతజయంతిలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకుల్లో ఒకరు కొరటాల సత్యనారాయణ అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద సత్యనారాయణ శతజయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి బలరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ 1923 సెప్టెంబర్ 24న గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో జన్మించారన్నారు. బాల్యం నుంచి దేశభక్తి భావాలను అలవాటు చేసుకున్నారు. విద్యార్థి దశలోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థి నాయకునిగా రాష్ట్ర ప్రధాన బాధ్యతలను నిర్వహించారని తెలిపారు. చదువు మధ్యలోనే ఆపేసి తన యావత్ జీవితాన్ని అంకితం చేశారన్నారు. మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో ఉంటూ ఉమ్మడి సిపిఐలో తరువాత సిపిఎం ఏర్పడిన తరువాత అగ్రనాయకుల్లో ఒకరిగా గుంటూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యునిగా విశేష సేవలు, బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించడంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రేపల్లెలో చేనేత కార్మిక సంఘాన్ని నిర్మించడంలో వారి సమస్యలపై విశేష కృషి చేశారు. గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గానికి శాసన సభ్యునిగా పనిచేశారన్నారన్నారు. కొరటాల జీవితం ఆదర్శవంతమైందని, ఆయన అడుగుజాడల్లో కార్యకర్తలు నడవాలని, ఆయన ఆశయాల దిశగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

నరసాపురం టౌన్ : సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కొరటాల సత్యనారాయణ అలుపెరుగని పోరాట యోధుడని పలువురు కొనియాడారు. స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో కొరటాల శతజయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ కొరటాల తన జీవిత చరమాంకం వరకూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలిచి ప్రజల కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, సభ్యులు పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, పాలపర్తి లక్ష్మీనారాయణ, బళ్ల రామ్మోహనరావు, మంత్రి రామానాయుడు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పివిఎల్ నరసింహమూర్తి

నూతన కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఉండి


రైతుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని వారు సూచించారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలతో అనుసంధానమై వారి సలహాలు సూచనలు తీసుకుని రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఏ కాలంలో ఏయే ఏ పంటలు పండించాలనే విషయంపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పుంత రహదారులను అభివృద్ధి చేసి రైతుల పంటను మిల్లర్లకు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, గుడాల శ్రీహరి గోపాలరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎంఎల్‌ఎ కౌరు శ్రీనివాస్, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మేడిది జాన్సన్, చినమిల్లి రాయుడు, ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

3న యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతో పాటు చట్ట వ్యతిరేకంగా జరిగిన అసంబద్ధ పని సర్దుబాటు, వేతనాలు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 3వ తేదీన మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ స్పష్టం చేసింది. ఈ ధర్నాకు సంబంధించిన నోటీసులను జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులకు యుటిఎఫ్ నేతలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.రామకృష్ణ ప్రసాద్, సిహెచ్ కుమార్‌బాబ్జి, మండల ప్రధాన కార్యదర్శి బి.నాగబాబు మాట్లాడారు. ఉపాధ్యాయులకు పని సర్దుబాటులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ అసంబద్ధ పని సర్దుబాటును రద్దు చేయాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు అందించలేదని, దీంతో ఆయా ఉపాధ్యాయులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వచ్చే నెల మూడో తేదీ సాయంత్రం 3 గంటలకు ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు.



డిఇఒ కార్యాలయ అధికారులకు నోటీసులు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

చంద్రబాబువి స్కాములు.. జగన్‌వి సంక్షేమ పథకాలు

ఎఎంసి ఛైర్మన్ ప్రమాణస్వీకారంలో ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - ఉండి

చంద్రబాబు నాయుడు పాలనలో స్కాములు, జగన్ పాలనలో పథకాలు అంటూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాద్‌రాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అధ్యక్షతన నిర్వహించిన ఎఎంసి ఛైర్మన్ ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథులుగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, ముదునూరి ప్రసాద్ రాజు, జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఛైర్మన్ మేడిది జాన్సన్, గుబ్బల తమ్మయ్య, గూడూరు ఉమాబాల, గుడాల శ్రీహరి గోపాలరావు, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, చిన్నమిల్లి వెంకట రాయుడు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాలనలో కేవలం అవినీతి స్కాముల్లోనే గడిపాడని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్లలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ దేశ చరిత్రలోనే 99 శాతం మేనిఫెస్టోను అమలు చేశారన్నారు. హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలు అర్థరహితమని తెలిపారు. ఆయన మెదడుకు అత్యవసర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందని మేడిది జాన్సన్ అన్నారు. బిసిలకు పెద్దపీట వేస్తూ వారిని రాజ్యసభకు పంపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కారుమూరి కొనియాడారు. వ్యవసాయ రంగానికి లక్షా 30 వేల కోట్లు కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అనిపిల్లి సుభాష్ చంద్రబోస్ గుర్తు చేశారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ కమిటీ పై ఉందని, దాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల స్థాయి నాయకులు, పాలకమండలి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కేంద్రాల ప్రారంభం

మండలంలోని మహదేవపట్నం గ్రామంలో ఉండి నియోజకవర్గ కన్వీనర్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు సహకారంతో సుమారు 1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాల, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తుందన్నారు. దీనిలో భాగంగానే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ శ్రీలక్ష్మి, గూడూరు ఉమాబాల, గుడాల శ్రీహరి గోపాలరావు, చినమిల్లి వెంకటరాయుడు, గ్రామ ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబుపై కేసులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబును అప్రతిష్టపాలు చేయడమే ధ్యేయంగా సిఎం జగన్ ఆయనపై అక్రమ కేసులు బనాయించారని కాపు సంక్షేమ సేన అభిప్రాయ పడింది. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని అడబాల గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్ర ముఖ్య నేతలు, బేరర్ల కీలక సమావేశం జరిగింది. వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి, బిజెపిని కలుపుకొని కలిసి ప్రయాణం చేయడం అనివార్యమని వారితో పవన్ కళ్యాణ్ ప్రయాణించడాన్ని సమర్థించింది. వైసిపిని ఓడించాలంటే జనసేన, టిడిపి కలిసి ప్రయాణం చేయాలని, అయితే 2 పార్టీలు టిక్కెట్లను సంతృప్తి చెందేలా పంచుకోవాలని అభిప్రాయపడింది. వైసిపిని ఓడించాలంటే వారు అమలు చేస్తున్న నవరత్నాలకు మించిన సంక్షేమ పథకాలు తీసుకురావాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో సేన నేతలు కరాటం రాంబాబు, ఇర్రంకి సూర్యారావు, మల్లినీడి బాబి, బొలిశెట్టి సత్యనారాయణ, చినిమిల్లి సత్యనారాయణ, చేగొండి సూర్యప్రకాష్, కరణం కళావతి, పొతుకూరి ఆనంద్, దాసరి చంద్రశేఖర్, చేగొండి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపు సంక్షేమ సేన సభ్యులు

శిఖామణికి చైతన్య సమాఖ్య తొలి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బుంగా లలితా మాధవరావు స్మారక తొలి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి డాక్టర్ శిఖామణికి అందించారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సభలో బుంగా కుటుంబ సభ్యులు, సమాఖ్య సభ్యులు పురస్కారంతో పాటు రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం అందించారు. సమావేశానికి సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అధ్యక్షత వహించారు. తెలుగు సాహిత్యానికి డాక్టర్ శిఖామణి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. యానం కళాశాల ప్రిన్సిపల్ భాస్కరరెడ్డి, మధునా పంతుల సత్యనారాయణమూర్తి, బుంగా జెస్సికళ, డాక్టర్ సుంకర గోపాలయ్య, డాక్టర్ కుంచే నాగసత్యనారాయణ, డాక్టర్ వివేక్, తోలేటి గాంధీ, ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రీ విజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం జాతీయ సేవా పథక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్ క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ పి.రామబద్రిరాజు మాట్లాడుతూ సేవ చేయడం జీవితానికి సార్ధకత అన్నారు. స్వచ్ఛంద రక్తదానం చేయించిన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లకు గవర్నర్ సంతకంతో కూడిన ప్రశంసాపత్రం అందిస్తామని చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన భీమవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా జాతీయ భావాలు, సేవా తత్పరత అలవడతాయన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీజీ సోషల్ వర్క్ హెడ్ డాక్టర్ నిట్టల కిరణ్ చంద్ర జ్యోతి వెలిగించి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విధివిధానాలను వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి దేశభక్తి, జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ నిర్వహించారు. గాంధీ స్ఫూర్తితోనే ఎన్ఎస్ఎస్ ఏర్పడిందన్నారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, కెజిఆర్ఎల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆరేటి రాణి, డాక్టర్ సిఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్, లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు, జిల్లా వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధి మేళం దుర్గారావు మాట్లాడారు. అనంతరం పోస్టల్, 108, ఆర్‌టిసి, రైల్వే పోలీస్, ఎఎన్ఎంలు, యూత్ హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు డిఎన్ఆర్, కెజిఆర్ఎల్, డాక్టర్ సిఎస్ఎన్, ఆర్ఆర్‌డిఎస్, శ్రీ ఆదిత్య విఎస్‌కె, డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లను రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో సత్కరించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో జిటిపి కళాశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, తెలుగు పండితులు కలిగొట్ల గోపాలశర్మ, యూత్ హాస్టల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

26న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 26వ తేదీ మంగళవారం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 ఏళ్ల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్, మానవత, పలు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. వివరాలకు 9949093115, 9440859700, 6300180993, 9494338086 సంప్రదించాలని తెలిపారు.

నేడు, రేపు సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ఈ నెల 25 ,26 తేదీల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎఒ ఎ జ్యోషిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న రైతులు తమ పొలాల్లో ఎలుక కన్నాలు గుర్తించి ఎరలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 26వ తేదీన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా 59 కేజీల బ్రోమోడైలిన్ మందు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎర మందుతో నూనె, నూకలు కలిపి ప్రతి రైతుకు పంచాయతీ వద్ద ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ)లతో పాటు ఆయా గ్రామాల్లో సర్పంచులు, ప్రజా ప్రతినిధి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గణపవరం : మండలంలో ఈ నెల 25, 26 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వై.ప్రసాద్ ఆదివారం చెప్పారు. 25వ తేదీన రైతులందరూ తమ పొలాల్లో ఎలుకల కన్నాలను మట్టితో కప్పాలని చెప్పారు. 26వ తేదీన మట్టితో కప్పిన కన్నాలు తెలుసుకుని ఉంటే ఎలకలు ఉన్నట్టుగా గుర్తించి అక్కడ ఎలుకల మందును ఉంచాలని చెప్పారు. మండలంలో 1225 ఎకరాలకు 62 కేజీల బ్రోమోడైలిన్ ఎలుకల ముందును రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మందుకు చెయ్యి తగలకుండా గ్లౌజుల సహాయంతో మందులు కలిపి ఎలుక కన్నాల వద్ద ఉంచాలని చెప్పారు. రైతులకు స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల మందును పొట్లాలు కట్టి ఇస్తామని తెలిపారు. రెండు రోజులపాటు రైతులందరూ ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు

పంట నమోదు వంద శాతం పూర్తి

మండలంలో 11,668 ఎకరాలకు పంట నమోదు చేయనున్నట్లు చెప్పారు. పంట నమోదు నూటికి నూరు శాతం పూర్తయినట్లు చెప్పారు. రైతులు వేలిముద్రలు సంబంధించి 6862 మంది రైతులకు 3974 మంది వేలిముద్రలు వేసినట్లు తెలిపారు. మిగిలిన 40 శాతం మంది రైతులు బుధవారం లోపు రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలు పరిశీలించుకుని వేలిముద్రలు పూర్తి చేయాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌కు ఇన్వెర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పాలకొల్లు రోటరీ క్లబ్ తరపున ఎమర్జెన్సీ లైటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీని నిమిత్తం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు, మద్దాల బ్రదర్స్ రాంప్రసాద్, వాసు రూ.18 వేలు ఖరీదైన ఎలక్ట్రికల్ ఇన్వెటర్, బ్యాటరీని పట్టణ సిఐ డి.రాంబాబుకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, మాజీ ప్రెసిడెంట్ మద్దాల వాసు, చందక రాము, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అర్జునరాజు కుటుంబానికి మంతెన పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల మరణించిన ఉండి గ్రామ మాజీ సర్పంచి గొట్టుముక్కల అర్జునరాజు కుటుంబాన్ని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు పరామర్శించారు. అర్జునరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ అర్జునరాజు సంఘ సేవకులు, విశ్రాంత ఇంజినీర్, రైతు ఉద్యమ నాయకుడిగా ఎన్నో పాత్రలు పోషిస్తూ గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారాలను ఎల్లప్పుడూ అందించేవారన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అర్జునరాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయి లచ్చిరాజు, గొట్టుముక్కల శ్యాం ప్రసాద్‌రాజు, కిన్నెర వెంకన్న, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కరిమెరక శ్రీను ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చెరువులను పూడ్చేస్తున్నారు..!

సుప్రీంకోర్టు ఉత్తర్వులు బేఖాతరు



చెరువు పూడ్చి నిర్మిస్తున్న సచివాలయ రైతు భరోసా కేంద్ర భవనం

ప్రజాశక్తి - ఆకివీడు

చెరువులు అడ్డంగా పూడ్చేస్తున్నారు. ప్రభుత్వమే నిబంధనలను తుంగలో తొక్కి నిర్మాణాలు సాగించడం విడ్డూరం. చట్టాలు చేయాల్సిన ప్రభుత్వమే ఆ చట్టాల్ని విసిరేస్తుంటే ఇంకా సామాన్యుడు ఎలా లెక్క చేస్తాడు. అదే పరిస్థితి ఇక్కడ ఏర్పడుతోంది. మండలంలోని అజ్జమూరు గ్రామం గరువుపై ఉన్న భోగం చెరువును పూడ్చి గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఉన్న వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్ర కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్నారు. దాతల ఆశయాన్ని ఇక్కడ తుంగలో తొక్కారు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు చేశారు. మంచినీటి చెరువులు, కాలువలు, నదులు, నీటి గుంటలు గాని ఏ రకంగానూ పుడ్చకూడదన్నది సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు. భవిష్యత్తులో పెరుగుతున్న ప్రజల అవసరాల మేరకు మంచినీటి కుంటలు పెంచడం సాధ్యమయ్యే విషయం కాదని, ఆ మేరకు ముందు జాగ్రత్తలు అవసరమని కోర్టు నిర్దేశించింది. ఆ మేరకు ప్రభుత్వం చట్టం చేయాలని ఏనాడో ఆదేశించింది. ఈ ఆదేశాన్ని తుంగలో తొక్కుతూ సాక్షాత్తు అధికారులే చెరువుల నిర్మాణాలు సాగిస్తుంటే ఇక ఆపేదెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకప్పుడు వేశ్యా వృత్తికి అంకితమైనటువంటి వారు గ్రామంలో ఊరికి చివరగా నివసిస్తూ ఉండేవారు. మంచినీరు సైతం అందక ఒకనాడు వారు ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. అటువంటి వారి సంరక్షణ కోసం ఎంతో దాతృత్వంతో సహకారం అందించారు నాటి దాతలు. వారికి మంచినీటి సౌకర్యం కోసం తమ భూములను ఈనాంగా ఇచ్చారు. అయితే ఆనాడు నోటి మాటే కాగితం కన్నా విలువైనటువంటిది అవడంతో మాటిచ్చారు గాని, కాగితాలు లేవు. ఆ మార్గంలోనే ఆకివీడు నుంచి భీమవరం వెళ్లే మార్గమధ్యలో అజ్జమూరు గరువు పైన భోగం వృత్తి వారల కోసం ప్రత్యేకించి ఒక చెరువు ఏర్పాటైంది. అదే భోగం చెరువుగా నేటి వరకు పిలుస్తూ ఉన్నారు. అయితే కాలం మార్పుల రీత్యా ఈ భోగం చెరువు వాడకం తగ్గి వినియోగం లేకుండా పోయింది. ఫలితంగా ప్రభుత్వం ఈ చెరువును బాగు చేసి పునరుద్ధరించాల్సింది పోయి పూడ్చి నిర్మాణాలు చేపడుతుంది. అప్పటికే స్థానికులు కొంతమంది అడ్డుకోవడంతో కొంతకాలం నిర్మాణం ఆగింది. కాగా సుమారు రెండు శతాబ్దాల నుంచి చెరువుగా ఉంది.

గొల్లలకోడేరులో వైసిపి సంబరాలు

ఘనంగా ఎఎంసి వైస్ ఛైర్మన్ రాజానరేంద్రకుమార్ ప్రమాణ స్వీకారం

వైసిపిలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం : ఎంపిపి చంటిరాజు



నరేంద్రకుమార్‌కుపుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపిపి చంటిరాజు



కేక్ కట్ చేస్తున్న ఎఎంసి వైస్ ఛైర్మన్ నరేంద్రకుమార్

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని గొల్లలకోడెరులో వైసిపి సంబరాలు అంబరాన్ని అంటాయి. డిజె సౌండ్లు, బాణసంచా కాల్పులు, కోలాహలం, ఆనందోత్సవాల మధ్య ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్ర కుమార్ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొల్లలకోడేరులో నరేంద్ర కుమార్ స్వగృహం నుంచి ఉండి మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు), సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు, శ్రేయోభిలాషులు నరేంద్ర కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ నరేంద్రకుమార్‌కు పదవి దక్కడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. నరేంద్రకుమార్ నిస్వార్థ నాయకుడని అభినందించారు. వైసిపిలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి ఎఎంసి వైస్ ఛైర్మన్ నరేంద్రకుమారే నిదర్శమని చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి, సర్పంచులు కడలి నాగేశ్వరి, చింతపల్లి చిన్న, కడలి విజయలక్ష్మి, ఇంజేటి మరియమ్మ, వైసిపి నాయకులు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, వెంకటరాజు, చెల్లబోయిన పాపారావు, పాల రాధాకృష్ణ, బొక్క రాంబాబు, హనుమంతరావు, గద్దం జోషి, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవ చేస్తా
ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ రాజానరేంద్రకుమార్

తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిస్వార్థంగా సేవ చేస్తానని ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ రాజానరేంద్రకుమార్ అన్నారు. పదవి కేటాయించిన వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజుకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. తనపై అభిమానం చూపిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా తన రాజకీయ జీవితంలో గ్రామస్తులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రైతులకు సేవ చేసే భాగ్యం కలగడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి, గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

క్రిస్టియన్ పేటల ఆధ్వర్యంలో సంబరాలు

నరేంద్రకుమార్ ఎఎంసి వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా క్రిస్టియన్ పేటల ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో గొల్లలకోడేరు మెయిన్ సెంటర్‌లో సంబరాలు చేశారు. నరేంద్రకుమార్‌కు బాణసంచా కాల్పులతో స్వాగతం పలికి క్రిస్టియన్‌పేట పెద్దలు, యూత్, మహిళలు పుష్ప మాలలు, పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మెయిన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను నరేంద్ర కుమార్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు జీవితంలో మర్చిపోలేనన్నారు. క్రిస్టియన్‌పేట వాసులు మాట్లాడుతూ నరేంద్రకుమార్ ఎఎంసి వైస్ ఛైర్మన్ పదవి రావడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జివి.నరసింహారావు, బాబూరావు, సోలోమోను, సాల్మన్, చంద్రశేఖర్, రాజశేఖర్, సత్యనారాయణ, గాంధీ, పవన్, దీపు, నరేష్, రవి, వెంకటరాజు, బన్ను పాల్గొన్నారు.

భారతీయ విద్యా భవన్స్‌కు గ్రీన్ స్కూల్ అవార్డు



అవార్డును ప్రదర్శిస్తున్న భవన్స్ యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం భారతీయ విద్యా భవన్స్‌కు గ్రీన్ స్కూల్ అవార్డును యునెస్కో అందించడం ఆనందంగా ఉందని, దీంతో తమపై మరిన్ని బాధ్యతలు పెరిగాయని భవన్స్ ఛైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన న్యూయార్క్‌లో కెవైసి డిప్యూటీ కమిషనర్ దిలీప్ చౌహాన్ చేతులమీదుగా గ్రీన్ స్కూల్ అవార్డును అందుకున్న ఆయన ఆదివారం భీమవరం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన జి-20 సదస్సులో తమ భవన్స్‌కు సంబంధించి మౌలిక వసతులు, ఎకో ఫ్రెండ్లీ ప్రోగ్రామ్స్ సమర్పించామని, వాటిని మదింపు చేసిన యునెస్కో తమకు గ్రీన్ స్కూల్ అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు. తమ సంస్థలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, విద్యుత్ పొదుపు, సెంట్రల్ సోలార్ సిస్టమ్, రెయిన్ హార్వెస్టింగ్ ద్వారా సేంద్రియ సేద్యం, ఎకో సిస్టమ్, క్యు ఆర్ కోడ్‌తో కూడిన వృక్ష సంపద, హరిత తరగతులు, ఆరోగ్యకర వాతావరణం, సామాజిక స్పృహతో కూడిన సేవలు ఇవన్ని తమకు అవార్డు రావడానికి ఉపకరించాయన్నారు. ఈ కార్యక్రమంలో భవన్స్ డైరెక్టర్, ప్రిన్సిపల్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి మానవత సేవలు అభినందనీయం



విద్యార్థులకు ప్రసంశపత్రాలను అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల అభ్యున్నతికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మానవత సంస్థ నెలవారీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు అధ్యక్షతన మార్టేరు మానవత కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఎస్‌విజిహెచ్ హైస్కూల్ హెచ్ఎం చిర్ల చిన సూర్యనారాయణ రెడ్డి, సూర్యతేజ, సూపర్ మార్కెట్ అధినేత సత్తి సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇద్దరు పేద విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కుంగుఫూ మాస్టర్ అరటికట్ల శ్రీనివాస ప్రభు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో మానవత చేస్తున్న ప్రోత్సాహకం మరువలేనిదన్నారు. మానవత అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు చేతులమీదుగా కుంగ్ ఫు విద్యార్థులకు ప్రశం సపత్రాలను అందించారు. మానవత జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవా కార్యక్రమాల్లో కుల, మత, పేద, ధనిక, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి శ్రీనివాసుల మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఉప సర్పంచి కర్రి వేణుబాబు, మానవత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ నేతృత్వంలో రిలే నిరాహార దీక్షలు 12 రోజు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షలకు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకట్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. సిఎం జగన్ కుట్ర రాజకీయాలను ప్రతిఒక్కరూ గమనిస్తున్నారన్నారు. చంద్రబాబును రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు నరసింహమూర్తి, శ్రీరామ్మూర్తి, ప్రసాద్, సీతారాం, ప్రభాకర్, మురళి, సత్య నారాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొలేని రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అవినీతి ఆరోపణలతో అరెస్టు చేయించిందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండల కేంద్రమైన ఉండిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిడిపి నాయకులు అర్థనగ్న జల దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ ఎవరెన్ని ఆరోపణలు చేసినా చంద్రబాబు అవినీతి మచ్చ లేకుండా జైలు నుంచి విడుదల అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఈ నిరంకుశ పరిపాలన నుంచి విముక్తి పొందాలంటే ప్రజలందరూ టిడిపి జనసేన కూటమికి మద్దతు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆకివీడు మండల అధ్యక్షులు మోటుపల్లి రాంప్రసాద్, ఉండి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, గొంట్ల గణపతి, కరిమెరక శ్రీనివాస్, బచ్చు కృష్ణ, బచ్చు సరళాదేవి, కాగిత బుజ్జి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలో ఆదివారం ఆ పార్టీ మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు. రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు ప్రారంభించారు. నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపిన భీమవరం మాజీ ఎంఎల్ఎ పి.రామాంజనేయులు మాట్లాడుతూ ఎటువంటి అవినీతి మచ్చలేని చంద్రబాబుకు మచ్చ అంటించాలని వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి జైలుకి పంపించిందన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ఐటి ఉద్యోగులు కార్ల ర్యాలీతో రాజమండ్రిలో నారా భువనేశ్వరికి మద్దతు ఇవ్వటానికి బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం మండల అధ్యక్షుడు రేవు వెంకన్న, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, నాయకులు నసిమ బేగం, మాదాసు కనకదుర్గ, ఎండి.షబీనా, బి.పద్మ, గంధం రాధ, నరహరిశెట్టి రూపవాణి, వీరమల్లు సూరిబాబు, కొల్లాటి నరసింహస్వామి, చిక్కాల వెంకటేశ్వరరావు, తిరుమాని సూర్య, పొన్నాల నరసింహస్వామి, బొమ్మిడి ధర్మరాజు, తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు సైకిళ్లపై గ్రామాల్లో ప్రదర్శన చేశారు. మండలంలోని కొత్తోట వంతెన వద్ద నుంచి సైకిళ్లతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్షాలతోనే ఆయనను వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను, కొల్లాటి నాగేశ్వరరావు, పెంటయ్య, మూలస్వామి, తాతబ్బాయి, తులసి రామారావు, బుల్లబ్బాయి, పెద్దసింగ్ నాగేశ్వరరావు, కోపనాతి జనక మహారాజు, మోకా ఏడుకొండలు ఉన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 12వ రోజు ఆదివారం గీత కార్మికులు దీక్షల్లో కూర్చున్నారు. అంతకు ముందు గీత కార్మికులు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబుపై జగన్ కక్ష కట్టి జైల్లో ఉంచారని, ప్రజలు రానున్న ఎన్నికల్లో జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారని చెప్పారు. టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, పెన్మెత్స రామభద్రరాజు, దుగ్గిన రాము పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు తలపెట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా సారవ గ్రామంలో టిడిపి కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లకు పోస్ట్ కార్డులు పంపి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కడలి హనుమంతు, పరసా రాము, నాగిడి స్టాలిన్, కవురు అంజి, గన్నాబత్తుల తులసీరామ్, బండారు నరసింహారావు, కంకటల శ్రీనివాస్, చినిమిల్లి వీరన్న, పరసా సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల : సిఎం జగన్ టిడిపి అధినేత చంద్రబాబుపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మండలంలోని పెదఅమిరంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు.

29 నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు తొమ్మిదో రాష్ట్ర అంతర్ జిల్లాల సీనియర్ మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్-2023 ఎంఎల్ఎ కప్పు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ అల్లం భాస్కర్‌రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి, సత్తి సుబ్బన్నరెడ్డి, గులుగూరి సత్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్‌రెడ్డి, కర్రి వినాయకరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు పడాల ప్రహ్లాద రెడ్డి మెమోరియల్ బాస్కెట్‌బాల్ గవర్నమెంట్‌కు 29వ తేదీన సభాధ్యక్షులుగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ముఖ్య అతిథిగా అమలాపురం పార్లమెంట్ సభ్యురాలు చింత అనురాధ, విశిష్ట అతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, గౌరవ అతిథులుగా జిల్లా డిఇఒ ఆర్.వెంకటరమణ హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ రెండో తేదీన ముఖ్య అతిథిగా జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ, రాజమండ్రి ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ హాజరవుతారని తెలిపారు.

తణుకులో ఉచిత న్యాయ సలహా కేంద్రం

ప్రజాశక్తి - తణుకు రూరల్

భర్త నుంచి భార్య మనోవర్తి కోరవచ్చని న్యాయవాది కామన మునిస్వామి అన్నారు. ఆదివారం తణుకు శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది కామన మునిస్వామి ఉచితంగా న్యాయ సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఒక మహిళ తన భర్త తనను వదిలేసి సుమారు మూడేళ్లు అయిందని, తాను తన తల్లి వద్దనే ఉంటున్నానని, తన తల్లి తనను పోషించలేని పరిస్థితిలో ఉందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. భర్త నుంచి వేరుగా జీవిస్తున్న మహిళ, మైనర్ పిల్లలు, తల్లిదండ్రులు మనోవర్తిని చట్ట ప్రకారం కోరవచ్చని మునిస్వామి తెలిపారు. దీనికి కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవాలని, న్యాయవాదితో వాదించుకోవాలని మునిస్వామి తెలిపారు. వాదనను బట్టి భర్త ఆర్థిక స్తోమతను బట్టి కోర్టు మనోవర్తిని మంజూరు చేస్తారని తెలిపారు సదరు మనోవర్తిని సక్రమంగా చెల్లించకపోతే అతనిని జైలుకు పంపే అధికారం కోర్టు వారికి ఉంటుందని మునిస్వామి తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు వచ్చిన సమస్యలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని అబ్బిరాజుపాలెంలో జనసైనికుల ఆధ్వర్యంలో ఇటీవల జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన పలువురికి ఆదివారం ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమానికి యలమంచిలి మండల అధ్యక్షులు డేగల సత్తికొండ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు బోనం చినబాబు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్బిరాజుపాలెం జనసైనికులు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా పాలకొల్లు నియోజకవర్గానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పవన్‌కల్యాణ్ ఆశయ సాధనలో ముందంజలో నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి పూనుకున్న అబ్బిరాజుపాలెంలోని జనసైనికులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా కార్యక్రమానికి ప్రధాన భూమిక పోషించిన పోశింశెట్టి రమేష్, శిరిగినీడి ప్రసాద్‌ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ కార్యదర్శి యాళ్ల రవీంద్ర నాయుడు, ఏనుగువానిలంక గ్రామ అధ్యక్షులు ఇనుకొండ రమేష్, గంటా ముత్యాలరావు, అబ్బిరాజుపాలెం జనసేన యూత్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

ప్రజాశక్తి - ఉండి

గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన ఉండిలోని సీతారాంపేట, భవానిపేట, కుర్మావారివీధి, సంతబజార్‌లోని వినాయక విగ్రహాలను గ్రామ పుర వీధుల్లో ఘనంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంత బజారులోని రెల్లి కులస్తులు మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా తమ ప్రాంతంలో గణపతి నవరాత్రులు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దీనికి సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాకు ప్రాంతంలో వినాయక ఆలయం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహ నిమజ్జోత్సవం సందర్భంగా గ్రామంలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

CHANGE OF NAME

I, KOTTURI SAILU, D/o. Sattayya, Transgender, R/o. D.No. 16a-6-49, Pedamalapalli, Tangellamudi, 5th Ward, Eluru, Eluru Dist, A. P. Earlier I was a male person mentioning my name as **KOTTURI RAMESH** (Old name) after transforming as transgender my name was changed as **KOTTURI SAILU** (New name) Hence after all this my documents and correspondences will continue with my new name **KOTTURI SAILU.**